
# మమతాంకురాలు

జి. భాను



హైదరాబాద్ వెంటనే రమ్మని ఉత్తరం వచ్చింది. వచ్చేటప్పుడు ఆదివరకు అనుకొన్న ప్రకారంగా డబ్బు తేవలసిందనీ, ఉద్యోగం ఖాయం అని ఆ ఉత్తరం సారాంశం!

నా మేనల్లుడు డిగ్రీ చేతికి వచ్చినా, గోళ్లు గిల్లుకొంటూ, రోడ్లు గస్తీ తిరుగుతున్న కారణంగా, హైదరాబాద్‌లో తెలిసిన మిత్రున్ని బతిమిలాడి, బామాలి, హోటళ్లు మొదలైనవాటికితిప్పి, ఉత్తరాలమీదఉత్తరాలు గుప్పించి, నా మేనల్లుడి పరిస్థితి ఏకరువు పెట్టి 'ఈ కరువు రోజుల్లో మీరు తప్ప గత్యంతరం లేదు' అని ప్రార్థించాను.

'సరేగాని ఒక షరతు ఇదుగో ఇంత ముడుపు చెల్లిస్తే తాత్కాలికంగా ప్రూనా డిపార్టుమెంటులో ఉద్యోగం వచే ఏర్పాటు చేస్తాను ఆహార, విహార, వ్యవహారాల్లో మొహమాటం ఉండకూడదనీ లోకరివాజు ప్రకారం మీదగ్గర దాచకుండా చెబుతున్నా ప్రయత్నం చేసినందుకు కొంత నాకు మిగతాది వాళ్లకు. తర్వాత నీ యిష్టం' అన్నాడు, చిన్నప్పుడు నాతో చదువుకొని, హైదరాబాద్ లో తడితీరి మొనగాడైన మోహనరావు. 'సరే' అని అతను చూపించిన ప్రేళ్లను చూసి ఒప్పుకొన్నాను. నేను వచ్చిన నెల పదిహేను రోజులకే ఈ ఉత్తరం వచ్చింది

ఇంతకు ముందే చేయవలసిన ప్రయత్నం చేశాను కాబట్టి ఉత్తరాన్ని చూసి హడావుడి పడలేదు నిమ్మకు నీరెత్తినట్లు స్థిమితంగా ఉన్నాను నా మేనల్లుని తాత్కాలిక ఉద్యోగం కోసం శాశ్వతంగా పడివుండే ఇళ్ల స్థలం అమ్మి, డబ్బు సంతనచేసి పెట్టుకొన్నాను.

ఉద్యోగాలు అన్వేషించే ప్రయత్నంలో నీతి నియమాలు, మానవత్వాల మూల్యాలు, తర్వాత సంభవించే ప్రభావాలు మొదలైన వాటిని గూర్చి ఆలోచించడం అనవసరమే కాదు, నిరర్థకం అనే అభిప్రాయానికి వచ్చిన నేను, ఉత్తరోత్తరా కలిగే మంచి చెడుల తారతమ్యాల్ని సమీక్షించి, తర్కించే, బాదరబందీకి లోను కాలేదు.

ఈ ప్రపంచం అంతా ఒక దారిని వెళ్తున్నప్పుడు, మామూళ్లు, లంచాలు, బహుమతులు, పార్టీలు మామూలు లాంఛనాలుగా పరిగణించబడుతున్నప్పుడు ఎన్ని బలహీనమైన అంతరాత్మలు ఘోషిస్తే మాత్రం ఏమిటి? అనే తాత్వికధోరణిలో నా మనస్సుకు చిక్కం పెట్టుకొన్నాను. ప్రయాణానికి సిద్ధం అయ్యాను. తీరా బట్టలు సర్దుతుంటే సూటుకేసు పాతదే, దాని పైమూత ఊడిపోయింది! అందుకని హరహరా అని బజారు పరుగెత్తాను మధ్యాహ్నం ఎండలో.

మెయిన్ బజారులో అన్వార్ ఇండస్ట్రీస్ అనే షాపు దగ్గరకు వెళ్లాను. అక్కడ పదమూడు, పధ్నాలుగేళ్ల కుర్రవాడు పని చేస్తున్నాడు. సన్నగా ఉన్నా ఉషారుగా ఉన్నాడు. పెద్ద కళ్లు అరవిక్కరు. పీచు లాంటి జుట్టు.

"రండి సార్... ఏం చెయ్యాలి సార్?" అన్నాడు

"నువ్వే రిపేరు చేస్తావా? ఇంకా పెద్దోళ్లు ఉన్నారా?!"

"అదేంటి సార్! చిన్నప్పట్నుంచి ఈ పన్లోనే ఉన్నాగదా సార్. బేగ్‌లు, గీగులు, సూటుకేసులు, గీటుకేసులు అన్నీ టకటకా చేసిపారేస్తా సార్..."

"సరే ఇదుగో ఈ సూటుకేసు మూత ఊడిపోయింది. లోపల గుడ్డకూడా ఊడి పోయింది ఎంత తీసుకొంటావో చెప్పు. ఇంతకీ నీ పేరేమిటి?"

"నా పేరు సుల్తాన్ సార్. ఇటియ్యండి" అని సూటుకేసు తీసుకొని, అటు, ఇటూ తిప్పి చూశాడు.

"దీనికి వెనక రివిట్లు ఊడి పోయ్యాయి సార్... చూడండి రెండు, మూడు రివిట్లు పడతై సార్. ఈ గుడ్డని జిగురుతో అంటించాల. మంచి రివిట్లు వెయ్యాలి సార్. ఒక్క రివిట్ ఖరీద్ రూపాయిన్నర సార్. రివిట్లు, నా కూలి మొత్తం ఆరు రూపాయ లవుతుంది సార్" అన్నాడు.

పనిసంగతేమోగాని మొత్తానికి మాటకారి లాగా కనబడ్డాడు ఆ కుర్రోడు. కొంచెం ఎక్కువగా చెబుతున్నట్లుగా నాకు అనిపించింది. అయినా ఒక విధమైన ఆకర్షణ, ఆ మాటల్లో ఉండడం వల్ల ఇంకో చోటికి వెళ్లే ప్రయత్నం చేయలేదు.

'ఇదుగో సుల్తాన్! ఆరు గీరు లేదు. చివరిమాట ఐదిస్తాను. తొందరగా చేసి పెట్టు. మెడికల్ షాపు కెళ్లి అమృతాంజనం తెచ్చుకొంటాను ఇంతలో' అని వెళ్లాను.

ఓ పావుగంటకు వచ్చేటప్పటికి సుల్తాన్ దా పని అరకొరగానే ఉంచేశాడు. ఒక రివిట్ మాత్రం బిగించాడు. నేను అక్కడున్న స్టూలు మీద కూర్చున్నాను.

అంతలో ఎవరో కుర్రోడు ప్లాస్టిక్ నవ్వారు సంచిలో వేసుకొని దిగులు మొహంతో వచ్చాడు. వాడికి పది, పదకొండు సంవత్సరాల కంటే ఎక్కువ వుండవు. పసితనం, అమాయికత్వం వాడి ముఖంలో తొంగి చూస్తున్నవి

'ఏమ్మి బాబూ! ఏంకావాలి?' సుల్తాన్ అడిగాడు.

'ఇదుగో! 'ఈ నవ్వారు కుట్టాలి?' అన్నాడు బైటకు తీసి.

'ఎన్ని సోట్ల కుట్టాలి?'

'ఎనిమిది చోట్ల కుట్టాలంట ... తెగిపోయిందంట... మా షావుకారు తొందరగా రమ్మన్నాడు... లేకపోతే అన్నానికి పంపించ డంట' దిగులుగా అన్నాడు.

'ఎవరు మీ షావుకారు?'

'పాపారావు ... విజయాటాకీస్ దగ్గిర కొట్టు'

'సరే ... రూపాయిన్నరవుతుంది దాన్ని కుట్టాలంటే...ఉందా?'

'అద్దురూపాయే యిచ్చాడు మా షావు కారు మరి'

'సరే జల్దీగా ఎళ్లి ఇంకో రూపాయి తీస్కురా...ఎనిమిది కుట్లకి అద్దురూపాయి యిస్తే గిట్టదనిచెప్పు...ఇది అద్దె యాపారం కాదు...ఎళ్లు...'


వీడు చాలా గట్టోడు. ఆఫీసరైతే ఇటువంటివాడు యమా లంచాలు పడతాడు అనుకొన్నాను. వయస్సు తక్కువైనా జాలిలేదు, కరుణ లేదు. డబ్బే ముఖ్యం వీడికి. డబ్బు ఎంత గడ్డి తినిపిస్తుంది? ఏ రంగంలోనైనా ఈ ధన దాహం ముమ్మరంగా ఉంది! అనుకొన్నాను.

'చూడండి సార్! ఈ షావుకారు లచ్మీ కొడుకులకు సిగ్గూ, శరమ్ లేదుసార్ ... ఆ పాపారావుది షామియానాల అద్దె కొట్టు సార్...పాపం ఆ కుర్రోణ్ణి తిండికి పంపలేదు సార్...ఎంత ఆశ సార్ షావుకార్లకి ... టీకి గూడా డబ్బు లివ్వర్ సార్ ఈ దొంగ నాయాళ్లు. అమ్మ! వీళ్లకి వీడు ఎంత కొచే స్తనాడో కమీషన్ అనే యావ సార్ ...' మనసంటే జాలి ఉండాలి సార్...' సుల్తాన్ మాట్లాడుతున్నాడు. నాకు ఒళ్లు మండుతున్నది.

గుద్దుల్లో నుంచి నిన్నమొన్న వచ్చిన బచ్చాగాడు, జాలి అనే మాటకు అర్థం తెలియని కురకుంక, లోకం అంటే అమీ తుమీ తెలియని పిల్లకాకి ఎవడికో లేని జాలిని గురించి నాతో మాట్లాడుతున్నాడు; నన్ను వాజమ్మను చేసి. దెయ్యాలు వేదాలు వల్లించడం అంటే ఇదే కాబోలు! ఎనిమిది కుట్లకు రూపాయిన్నర కావాలని పట్టుపట్టిన వీడు ధర్మప్రభువు! మిగతావాళ్లు అధర్మ చక్రవర్తులు! లోకంలో ఈనాడున్న విచిత్రం ఏమిటంటే బొడ్డూడని వాడు మొదలుకొని గద్దెక్కిన ప్రతిగాడిద కొడుకు ధర్మపన్నాలు వల్లించే వాళ్లే! హరికథల్లో పిట్టకథలు కలిపికొట్టేవాళ్లే! క్రియ దగ్గరకు వచ్చే టప్పటికి అంతా తల్లక్రిందులు! అదే కాకపోతే నేను ఎండలో పడివచ్చి, ఈ సూటుకేసు రిపేరు చేసుకోవలసిన దుర్గతే పట్టేది కాదు!

అంతలో ఇంతకు ముందు వెళ్లిన కుర్రవాడు వచ్చాడు. వాడి ముఖంలో ఏడుపు కనబడుతున్నది. ఎండలో రావడం వల్ల చెమట బాగా పట్టింది. చొక్కాతో ముఖం తుడుచుకొన్నాడు.

'తెచ్చావా?' అన్నాడు సుల్తాన్.



## పవిత్ర రుద్రాక్ష

1 నుండి 14 ముఖములుగల పవిత్ర రుద్రాక్షలు, చందనం తులసి పసుపుపచ్చ మరియు గులాబిరంగుల జపమాలలు, శిలాజిత్తు, గోరోచనం, దక్షిణావర్తశంఖము, అదృష్టమును కల్పించే శ్రేష్టమైన రాళ్ళు, లభించును. కోరినవారికి ధరలపట్టి పంప బడును. హిందీ లేక ఇంగ్లీషులో వ్రాయండి.

**Shree Jagdamba Bhawan**
**(A. M.)** SONEPAT-131001.



## దీర్ఘవ్యాధులకు ఉత్తమవైద్యం

దురభ్యాసములకు లోనై, దాంపత్యసౌఖ్యంపొందలేనివారికి హెర్నియా, చర్మవ్యాధులకు పోష్టుద్వారా వరిబీజం(బుడ్డ) ఇస్నోఫిలియా ఉబ్బసం (దమ్ము) జీర్ణాశయ(గ్యాస్ట్రిక్)మూత్ర,స్త్రీల వ్యాదులకు ఆపరేషన్ లేకుండా చికిత్స చేయబడును. -రండి

**డా॥దేవర**

3/1 బ్రాడీపేట, గుంటూరు. (A.P.)



## జర్మన్స్ కటర్



తామర, గజ్జి, చిడుములకు



## ఆంధ్రపత్రిక

దినపత్రిక చదవండి.

- సాహిత్య సేవకు
- సాహిత్య స్థాయికి
- తాజా వార్తలకు
- కొత్త శీర్షికలకు

చదవండి!


# మమతాంకురాలు

'ఆఁ...మరే... మా షావుకారే మొత్తం రూపాయిపావలే ఇచ్చాడు, మిగతా పావలా నన్నేసుకోమన్నాడు. నా కిచ్చే బేటాలో కలిపి రేపిస్తానన్నాడు. లేకపోతే ఇంటికి పంప డంటూ అన్నానికి' అన్నాడు.

'ఆహాఁ ... సరే ... మంచిదే ... ఏదీ రూపాయిన్నర ఇక్కడ పెట్టు'

రూపాయిన్నర మిషన్ బల్లమీద పెట్టాడు ఆ కుర్రవాడు.

నా సూటుకేసు గుడ్డను అతికించ బోతున్న సుల్తాన్ ఆ పని ఆపి, 'సార్! మీ పని అయిపోతుంది ఒక్క నిమిషంలో వీణ్ణి పంపేస్తాను' అని మిషను మీద ఎక్కి ఆ నవ్వారు అతుకులు గబగబా కుట్టాడు. కొద్ది నిమషాల్లో ఆ పని పూర్తిచేశాడు. కుర్రగాడికి ఎంత ఆశ! డబ్బులు కనబడితే చాలు ఒక పని ఆపి ఇంకోపని అందుకొంటువ్నాడు. సుల్తాన్ అంటే మనసులో నాకు కోపం ద్విగుణీకృతమైంది.

'చుట్టుకో బాబు నవ్వారు' అన్నాడు సుల్తాన్ ఆ కుర్రోణ్ణి ఉద్దేశించి. తర్వాత జిగురుతో నా సూటుకేసు గుడ్డను అతికిం చాడు.

'అయిపోయింది సార్ మీ పని! చూసు కోండి... డబ్బులివ్వండి...'

నేను డబ్బులిచ్చి పెట్టెను క్రిందాపైనా చూసుకొంటున్నాను.

నవ్వారు చుట్టుకొని కుర్రవాడు వెళ్ల బోతున్నాడు.

'బాబూ! ఇదుగో మాట! ఈ రూపాయిన్నర నువ్వే తీస్కో ... మీ షావు కారుతో నాకిచ్చానని చెప్పు...పాపం! ఆకలవు తుందన్నావుగా, రిక్షాలో ఇంటి కెళ్ళు. ఇదుగో ఈ పదిపైసలు సోడా తాగు. ఇటువంటి కష్టాలు నాకు తెలుసు. ఈ షావుకార్లు ఇంతే. జాలి ఉండదసలు. నాకు తెలుసుగా, దొంగ నాయాళ్లు ...' అని బక్కెటు లోని నీళ్లతో చేతులు కడుక్కొంటు న్నాడు మెరుస్తున్న కళ్లతో ఆ కుర్రవాడు సుల్తాన్ వైపు ప్రశంసా పూర్వకంగా చూసి వెళ్లిపోయాడు.

ఈ సన్నివేశం చూస్తున్న నేను నిర్ఘాంత పోయాను. నా ఊహకు భిన్నంగా జరిగిన సంఘటన అది!

## డాన్సులు

కాలేజీ—చదువుల్లోనే
చేస్తారు
కుర్రకారంతా
'ఆరంగేట్రం'
(రంగప్రవేశం)

పదహారేళ్ల పడుచుపిల్లల
పరుగులెత్తే పరువంలో
కొత్త అందాలు
'భరతనాట్యం'

దూరాన వున్న ప్రేయసి
ప్రేమలేఖ ఆలస్యమైతే
ప్రియుడి మనసు
'కథాకళి'

చిలిపి వయసు
చేసే
వలపు విన్యాసాలే
'డిస్కో'

పెళ్లికెదిగి కూర్చున్న
ఆడపిల్ల తండ్రి
అంతరంగంలో
'శివతాండవం'

అందుకే
ప్రపంచమే
ఒక
'రంగస్థలం'

— తిరునగరి వెంకట నారాయణ మూర్తి

వీణ్ణి ఒట్టి మాటల పోగు అనుకున్నాను కాని, వాడి మనసులో అమృతపు సోన ఉంటుందని అనుకోలేదు! వీడి గుండెలోనూ మమతాంకురాలు మొలిచాయి!

ఇంకా కళ్ళు తెరవని కుర్రవాడైతే నేమి వాడిలో స్పందించే మమత, మానవత ఈ లోకంలో పెద్దలుగా చెలామణి అవుతున్న పెద్దమనుషుల్లో, అధికారుల్లో, మహాను భావుల్లో, స్నేహితుల్లో ఎందుకు మృగ్యమై పోయిందో నాకు అనూహ్యమైంది!

నా కన్నులు చెమర్చాయి.

'సుల్తాన్ బాగుచేసింది నా సూటుకేసును మాత్రమే కాదు; నా మస్తిష్కాన్ని' అనే పదునైన ఆలోచనలతో ఇంటిముఖం పట్టాను సంతృప్తిగా.